సాక్షి ప్రకాశం

గురువారం । 23 । మే । 2024



తోతాపురి... రైతులకు సిరి

జ్యూస్ తయారీకి ఉలవపాడు నుంచి మామిడి ఎగుమతులు ప్రారంభమయ్యాయి. ఎగుమతి చేసే మామిడి కాయలు టన్ను రూ.20 వేల వరకు ధర పలుకుతోంది. - 8లో..



సెలయేరు పారుతుంటే

ప్రముఖ పర్యాటక క్షేత్రం భైరవకోనలో జలపాతం జలసవ్వడులతో సందడి చేస్తోంది. దాన్ని చూసేందుకు పర్యాటకులు తరలి వస్తున్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
37.2/28.4

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

హ్యాండ్‌లూమ్స్ టెక్నాలజీ డిప్లొమాకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు అర్బన్: హ్యాండ్ లూమ్స్ టెక్నాలజీలో మూడు సంవత్సరాల డిప్లొమా కోర్సు చేసేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు చేనేత, జౌళి శాఖ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ వీ భీమయ్య ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి జిల్లా వెంకటగిరిలో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ ఇనిస్టిట్యూట్‌లో చదివేందుకు అర్హత ఉన్న విద్యార్థులు 2024–25 సంవత్సరానికి సంబంధించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

రేపు డీసెట్ ప్రవేశ పరీక్ష

ఒంగోలు: డీసెట్ 2024 ప్రవేశ పరీక్ష ఈనెల 24న ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సౌత్ మామిడిపాలెంలోని నేషనల్ కౌన్సిల్ ఫర్ ద చర్చి సోషల్ యాక్షన్ ఇండియా లో పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పరీక్షకు హాజరుకావాల్సిన విద్యార్థులు ఒక గంట ముందుగా పరీక్ష కేంద్రానికి రావాలని, సవరణలు ఏవైనా ఉంటే ముందుగానే జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలోని పరీక్షల విభాగంలో సంప్రదించాలన్నారు. పూర్తి సమాచారానికి సెల్ నెంబర్ 8125264606ను సంప్రదించాలన్నారు.


బాలికను దత్తత తీసుకున్న ఎన్ఆర్ఐ దంపతులు



శిశు గృహలోని బాలికను దత్తత ఇస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు అర్బన్: శిశు గృహలో రక్షణ పొందుతున్న ఎవరూ లేని బాలికను అమెరికాలో స్థిరపడిన హైదరాబాద్ తెలుగు దంపతులు దత్తత తీసుకున్నారు. ఆ మేరకు బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ దినేష్‌కుమార్ చేతుల మీదుగా పాపను దత్తత ఇవ్వడంతో పాటు సంబంధిత ధ్రువ పత్రాలను అందజేశారు. అమెరికాలో స్థిరపడిన హైదరాబాద్ తెలుగు దంపతులు అయిన అజయ్‌గోపి, మృదుల ప్రియదర్శిని పాపను దత్తత తీసుకోవడం సంతోషకరమని, దత్తత ప్రక్రియను వేగంగా పూర్తి చేసి పాపను అప్పగించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ దంపతులు అమెరికాలోని జార్జియా రాష్ట్రంలో సొంత సాఫ్ట్‌వేర్ కంపెనీ నిర్వహిస్తూ అక్కడే స్థిరపడ్డారు. దీనిలో శిశు అభివృద్ధి శాఖ అధికారి మాధురి, బాలల సంరక్షణ అధికారి దినేష్‌కుమార్‌లు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహస్వామి కళ్యాణం కమనీయం



స్వాములవారి కళ్యాణ తంతు నిర్వహిస్తున్న దృశ్యం

మద్దిపూడి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన దేవాలయాల్లో ఒకటైన పృధులగిరి పై వేంచేసిన లక్ష్మీ నృసింహస్వామి కళ్యాణం బుధవారం కమనీయంగా జరిగింది. క్రోధినామ సంవత్సర వైశాఖ చతుర్దశి నృసింహస్వామి జయంతి సందర్భంగా కల్యాణం నిర్వహించారు. పైడిమర్రి వెంకట కృష్ణమూర్తి, ఝాన్సీ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఆలయ అర్చకులు నారాయణం రమణాచార్యులు, శేషాచార్యులు ఆధ్వర్యంలో రుత్విక్ బృందం పుణ్యాహవచనం, విశేష పంచామృత స్థపన, భూదేవి సహిత లక్ష్మీనృసింహస్వామి అమ్మవార్లు కళ్యాణం అత్యంత వైభవోపేతంగా వేద పండితులచే నిర్వహించారు. ఆలయ ప్రదానం అర్చకులు స్వాములవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఉభయదాతలు అమ్మవార్లకు బంగార మంగళసూత్రం చేయిస్తామని చెప్పారు. చీమకుర్తికి చెందిన లక్ష్మీనృసింహస్వామి నాట్యమండలి కడవ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి ప్రజలకు క్షేత్రంపై నరసింహనామ సంకీర్తన సప్తాహం నిర్వహిస్తున్నారు. భక్తులకు భోజన వితరణ చేశారు. పౌర్ణమి సందర్భంగా రాత్రికి ప్రత్యేక పూజలు చేసి స్వామివారిని ఘనంగా ఊరేగించారు. పృధులగిరిపై కళ్యాణం తిలకించేందుకు భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఉభయదాతల దంపతులను ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నారాయణం శశాంక్, వినుకొండ మోహన్, కృష్ణనారాయణ జస్వంత్ ఉన్నారు.

లెక్కింపు.. భద్రం

ఎన్నికల రణరంగంలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యం తేలేందుకు 12 రోజులు మిగిలింది. ఇప్పటికే ఓటర్లు తమ తీర్పును ఈవీఎంలలో నిక్షిప్తం చేశారు. పోలింగ్ సందర్భంగా పలు ప్రాంతాల్లో ఘర్షణలు జరగడంతో కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు రోజు భద్రతను మరింత కట్టుదిట్టం చేయనున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ స్ట్రాంగ్ రూములను ప్రతిరోజూ తనిఖీ చేస్తూ భద్రతా చర్యలు, తలుపుల సీళ్లను పరిశీలిస్తున్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పాల్గొనే ఉద్యోగులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు.



కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్ (ఫైల్)

- జూన్ 4న తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- కౌంటింగ్‌కు పక్కాగా ఏర్పాట్లు
- నిమగ్నమైన అధికార యంత్రాంగం
- సిబ్బందికి శిక్షణ తరగతులు
- ఇప్పటికే స్ట్రాంగ్ రూముల్లోని ఈవీఎంల్లో ఓట్లు నిక్షిప్తం
- జిల్లాలో 87.12 శాతం ఓటింగ్ నమోదు, దర్శిలో అత్యధికంగా 91 శాతం
- కౌంటింగ్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్న నాయకులు, ప్రజలు

జిల్లాలో 87.12 శాతం పోలింగ్

రాష్ట్రంలో అత్యధికంగా జిల్లాలో 87.12 శాతం ఓటింగ్ నమోదైంది. దర్శిలో అత్యధికంగా 91 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లాలో మొత్తం 18,22,470 మంది ఓటర్లు ఉండగా అందులో 15,87,681 మంది ఓటర్లు వారి ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీంతో జిల్లాలో 87.12 శాతం ఓటింగ్ నమోదైంది. 2019 ఎన్నికల్లో పోలింగ్ 86.04 శాతం కాగా ఈ దఫా ఒక శాతం అధికంగా నమోదైంది.

మొత్తం ఓటర్లు
18,22,470

పోలైన ఓట్లు
15,87,681

ఓట్ల లెక్కింపునకు పక్కా చర్యలు



జరగనున్న ఓట్ల లెక్కింపు (కౌంటింగ్)కు సంబంధించి ఏర్పాట్లను పక్కాగా నిర్వహిస్తున్నాం. కౌంటింగ్‌లో ఎటువంటి అవరోధాలు లేకుండా స్పష్టంగా నిర్వహించేలా అన్నీ చర్యలు తీసుకున్నాం. కౌంటింగ్ సిబ్బందికి తగిన శిక్షణ ఇస్తున్నాం. కౌంటింగ్ రోజు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లాలో పోలింగ్ ప్రశాంతంగా జరిగినట్లు కౌంటింగ్ కూడా జరిగేలా చర్యలు చేపట్టాం. కౌంటింగ్ ప్రక్రియ మొత్తం సీసీ కెమెరా నిఘాతో పాటు పోలీసు బందోబస్తుతో పటిష్టంగా నిర్వహిస్తాం.

– ఏఎస్ దినేష్‌కుమార్, కలెక్టర్

మొత్తం ఓట్లు, పోలింగ్ కేంద్రాల వివరాలు ఇవీ...

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	మొత్తం ఓటర్లు	ఓటు వేసిన ఓటర్లు	శాతం
యర్రగొండపాలెం	265	207214	185242	89.4
దర్శి	282	226370	205792	90.91
సంతనూతలపాడు	256	214638	187721	87.46
ఒంగోలు	259	240242	203163	84.57
కొండపి	283	239609	210896	88.2
మార్కాపురం	257	214608	188155	87.67
గిద్దలూరు	284	239710	202397	84.43
కనిగిరి	297	240079	204315	87.12
మొత్తం	2183	18,22,470	15,87,681	87.12

ఒంగోలు అర్బన్:

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మే 13వ తేదీన పోలింగ్ జరిగింది. అన్నీ నియోజకవర్గాల ఈవీఎంలను ఒంగోలు నగర సమీపంలోని రైజ్ ఇంజినీరింగ్ కాలేజీ స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. జూన్ 4వ తేదీ అన్నీ నియోజకవర్గాల ఓట్లను లెక్కించనున్నారు. ఆ మేరకు కౌంటింగ్ ఏర్పాట్లను శరవేగంతో చేస్తున్నారు. ఓట్ల లెక్కింపునకు ఎన్ని టేబుళ్లు ఏర్పాటు చేయాలి, భద్రతా చర్యలు, రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బందికి సంబంధించి ఏ విధంగా కౌంటింగ్ నిర్వహించాలో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఒక వైపు అధికార యంత్రాంగం ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై దృష్టి సారిస్తే, మరో వైపు రాజకీయ నాయకులు, కార్యకర్తలు పార్టీలకు సంబంధించిన అభిమానులు ఓట్ల లెక్కింపు కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

కౌంటింగ్ ప్రక్రియ ఇలా...

ఓట్ల లెక్కింపునకు సంబంధించి రైజ్ కాలేజీలో జిల్లాలోని 8 నియోజకవర్గాలకు విడివిడిగా గదులు కేటాయించారు. ఒక్కో నియోజకవర్గానికి సంబంధించిన గదిలో 28 టేబుళ్లు ఉంటాయి. అందులో 14 టేబుళ్లు అసెంబ్లీ సెగ్మెంట్‌కు, 14 టేబుళ్లు పార్లమెంట్ సెగ్మెంట్‌కు ఉండేలా ఏర్పాటు చేస్తున్నారు. ఆయా నియోజకవర్గాల పోలింగ్ కేంద్రాలను బట్టి ఎన్ని రౌండ్‌లు ఓట్ల లెక్కింపు జరుగుతుందో నిర్ణయమవుతోంది. కనిగిరి నియోజకవర్గంలో అత్యధికంగా 297 పోలింగ్ కేంద్రాలు ఉండటంతో ఈ నియోజకవర్గానికి ఎక్కువ రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరుగుతుంది. తొలుత స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచిన ఈవీఎంలను నియోజకవర్గాల వారీగా 17సితో పోల్ అయిన ఓట్లను మొత్తంతో సరిచూస్తారు. అనంతరం టేబుళ్లపై ఈవీఎంల్లోని రిజల్ట్ బటన్‌తో సీరియల్ నంబర్ల ప్రకారం పోలైన ఓట్లను లెక్కిస్తారు. ఓటు వేసేటప్పుడు వీవీప్యాట్‌లో పడిన స్లిప్‌లను ఒక్కో ఈవీఎంకు సంబంధించి ర్యాండమ్‌గా 5 స్లిప్‌లను మాత్రమే పరిశీలిస్తారు. ఏదైనా 17సి, ఈవీఎంలోని ఓట్లకు భారీ మొత్తంలో తేడా వస్తే స్లిప్‌లను పూర్తిగా లెక్కిస్తారు. తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం అసెంబ్లీ సెగ్మెంట్‌కు 4 టేబుళ్లు, పార్లమెంట్ సెగ్మెంట్‌కు 40 టేబుళ్లు ఏర్పాటు చేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు. కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు ఎన్నికల సంఘం 8 నియోజకవర్గాలకు 8 మంది పరిశీలకులను నియమించింది. వీరితో పాటు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్, నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్, కౌంటింగ్ అసిస్టెంట్, టేబుల్ ఇన్‌చార్జ్‌లతో పాటు అభ్యర్థులు ఆయా పార్టీల ఏజెంట్లు ఉంటారు.

అల్లర్లు.. అణచివేత

- అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో మార్కాపురంలో మాబ్ డ్రిల్
- కౌంటింగ్ సందర్భంగా ప్రత్యేక చర్యలు



పోలీసు స్టేషన్ ఎదుట దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఆందోళనకారులు


మార్కాపురం:
సమయం: సాయంత్రం 5.30 గంటలు
స్థలం: పట్టణ పోలీసు స్టేషన్ ఎదురు

ఒక్కసారిగా గుంపులు గుంపులుగా ఒక పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు పోలీసులు డౌన్... డౌన్.. అంటూ గట్టిగా నినాదాలు చేస్తూ పెద్దఎత్తున నిరసన చేపట్టారు. ఎదురుగా పోలీసులు మొహరించి నిరసనకారులను వెళ్లిపోవాలని మైకుల్లో గట్టిగా చెబుతున్నారు. ఆందోళనకారులు వెంటనే తమ వద్ద ఉన్న రాళ్లను, పొగ బాంబులను పోలీసుల పైకి విసిరారు. పాత బస్టాండులో ఏమవుతుందో అర్థంకాక ప్రజలు ఒకింత ఆందోళనకు గురై అక్కడ నుంచి పరుగులు తీశారు. ఇంతలో ఏపీఎస్పీ బలగాలు ఆందోళనకారులతో లాఠీచార్జి చేసినా వెనక్కి తగ్గకుండా పోలీసుల పైకే రాళ్లు రువ్వారు. పోలీసులు భాష్పవాయువులను ప్రయోగించారు. ఫైరింజన్‌తో ఆందోళనకారులపై నీళ్లు చిమ్మారు. వారు కూడా పోలీసులపై ఎదురుదాడికి తిరగడంతో తప్పనిసరి పరిస్థితుల్లో పోలీసులు జరిపిన కాల్పుల్లో ఇద్దరు గాయపడ్డారు. అంబులెన్స్‌లో వారిని జీజీహెచ్‌కు తరలించారు.


ఇదంతా నిజమనుకునేరు... జిల్లా అదనపు ఎస్పీ అశోక్‌బాబు ఆధ్వర్యంలో అల్లర్లు జరిగితే పోలీసులు ఎలా ఎదుర్కొంటారు అనే అంశంపై మాబ్ డ్రిల్ నిర్వహించారు. అప్పటి వరకూ జరిగిన సంఘటనలు నిజమనుకున్న ప్రజలు పోలీసులే ఇదంతా చేశారనుకుని హాయిగా ఊపిరి పీల్చుకున్నారు. మార్కాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఏఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుల్స్ ఆందోళనకారులుగా కొద్దిసేపు నటించారు. ఒంగోలు నుంచి వచ్చిన ఏఆర్ పోలీసులు అల్లర్లను ఎలా అదుపుచేయాలో చూపారు.

కౌంటింగ్ సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు:

కౌంటింగ్ సందర్భంగా పశ్చిమ ప్రకాశంలో ఎటువంటి గొడవలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డీఎస్పీ బాలసుందరరావు తెలిపారు. బుధవారం సాయంత్రం పాతబస్టాండులో అదనపు ఎస్పీ అశోక్‌బాబుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కౌంటింగ్ అనంతరం ఎటువంటి గొడవలు, దౌర్జన్యాలు, అల్లర్లకు పాల్పడిన వారిపై తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. 144వ సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించామని, కౌంటింగ్ అనంతరం కూడా నాయకులు, కార్యకర్తలు ప్రశాంతంగా ఉంటూ పోలీసులకు సహకరించాలని కోరారు. ప్రతిరోజూ పశ్చిమ ప్రకాశంలో కార్డన్ సెర్చ్ జరుగుతోందని, అనుమానితులను, అనుమతి పత్రాలు లేని వాహనాలను పోలీసు స్టేషన్‌కు తీసుకొస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్, పలువురు ఏఆర్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



గాలిలోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు



గాయపడిన వారిని అంబులెన్స్‌లో తరలిస్తున్న పోలీసులు

నాణ్యమైన పొగాకును వేలానికి తీసుకొని రావాలి



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు

- పొగాకు అత్యధిక ధర కేజీ రూ.320

టంగుటూరు: పొగాకు రైతులు తాము పండించిన నాణ్యమైన పొగాకును వేలం కేంద్రానికి తీసుకొచ్చి అధిక ధరలు పొందాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో బుధవారం జరిగిన వేలంలో పొగాకు అత్యధిక ధర కేజీ రూ.320 అత్యధిక ధర పలికింది. కారుమంచి క్లస్టరు గ్రామాలకి చెందిన రైతులు 436 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 406 కొనుగోలు జరిగ్గా, 30 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. గరిష్ట ధర రూ.320 కాగా, కనిష్ట ధర రూ. 205, సరాసరి రూ.262. 93 ధర పలికింది. ఈ వేలంలో మొత్తం 36 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

కొండపిలో రికార్డు ధర పలికిన పొగాకు

కొండపి (సింగరాయకొండ): ప్రకాశం జిల్లా కొండపిలోని పొగాకు వేలం కేంద్రంలో బుధవారం నిర్వహించిన వేలంలో పొగాకు అత్యధిక ధర కిలో రూ.320 పలికిందని, కొండపి బోర్డు చరిత్రలోనే రికార్డు ధర అని వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. వ్యాపారులు చతుకుపాడు, కె.అగ్రహారం, మూగచింతల, గుర్రప్పడియ, నెన్నూరుపాడు గ్రామాలకు చెందిన రైతులు 1077 బేళ్లు తీసుకునిరాగా 1018 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 59 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.320, కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.269.43, వేలంలో 22 మంది వ్యాపారులు పాల్గొన్నారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు నిర్వహించిన వేలంలో బుధవారం అత్యధిక ధర రూ.320 రైతులకు దక్కిందన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

- జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ కే బేబి రాణి
- 62 మంది పశుసంవర్ధక శాఖ సహాయకులకు ముగిసిన శిక్షణ

ఒంగోలు సెంట్రల్: పశుసంవర్ధక శాఖలో ప్రభుత్వం నూతనంగా నియమించిన 62 మంది పశుసంవర్ధక శాఖ సహాయకులకు 45 రోజు పాటు జరిగిన శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా డీఏడీఏ సమావేశపు మందిరంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ కే బేబిరాణి మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న పశుసంవర్ధక శాఖ సహాయకులు నేర్చుకున్న విషయాలను క్షేత్ర స్థాయిలో రైతులకు అందుబాటులో ఉండి వారికి ఉపయోగపడి పాడి పరిశ్రమ వృద్ధికి తోడ్పాటువ్వాలని కోరారు. వృత్తిలో రాణిస్తే గుర్తింపు వచ్చి మంచి స్థాయికి ఎదుగుతారని చెప్పారు. శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పశువైద్య సహాయకులు ఎస్ రవి, సీహెచ్ నీరజ, షేక్ తస్లీం, పి.శివ ప్రసాద్‌లకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఎల్‌డీఏ కార్యనిర్వహణాధికారి, ఉప సంచాలకులు డాక్టర్ షేక్ కాలేషా, శిక్షణ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస రెడ్డి, రిసోర్స్ పర్సన్, సహాయ సంచాలకులు డాక్టర్ బసవ శంకరరావు, డాక్టర్ నాగభూషణం, పశువైద్యులు డాక్టర్ సాంబ శివరావు, డాక్టర్ సాహితీ, డాక్టర్ స్వాతి, డాక్టర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ పొందిన పశుసంవర్ధక శాఖ సహాయకులతో జిల్లా పశు వైద్యాధికారి బేబి రాణి, వైద్యులు

ఆరోగ్య శ్రీ నిలిపివేత అసత్యం

ఒంగోలు టౌన్: ఈ నెల 21వ తేదీ నుంచి ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేసినట్లు సామాజిక మాధ్యమాలు, కొన్ని మీడియా సంస్థలు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని ఆరోగ్య శ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డా.హేమంత్ కుమార్ పతకమూరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కథనాలన్నీ అవాస్తవాలని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా 40 ఆరోగ్య శ్రీ ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉన్నాయని, అందులో బుధవారం కూడా 1500 ఔట్ పేషంట్లు, 200 మందికి పైగా ఇన్‌పేషంట్లకు ఆరోగ్యశ్రీ పథకంలో వైద్య సేవలు పొందారని వివరించారు. ప్రకాశం జిల్లాలో ఆరోగ్య శ్రీ సేవలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని తెలిపారు. జిల్లా ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని, ఎప్పటిలాగే యమర్జన్సీ, నాన్ యమర్జన్సీ వైద్య సేవలను ఉచితంగా పొందాలని సూచించారు.

గత ఏడాది నుంచి ఇదే ప్రచారం..

ఆరోగ్యశ్రీ సేవలను ప్రైవేటు ఆస్పత్రుల్లో నిలిపేస్తున్నట్లు గత ఏడాది కాలంగా ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తోంది. ఎప్పటికప్పుడు ఈ నెల చివరిలో ఆరోగ్య శ్రీ సేవలు ఆగిపోతాయని నిరుపేద రోగుల్లో భయాందోళనలు సృష్టించే కుట్రలకు పాల్పడుతోంది. ఏడాది కాలంగా ఎల్లో మీడియా ప్రచారం చేస్తున్నప్పటికీ ఆరోగ్యశ్రీ సేవలు మాత్రం ఆగిపోలేదు. కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పుడు కూడా అదే తరహాలో చేస్తున్న ప్రచారం అంతా అసత్యమేనన్న సంగతి ఆరోగ్య శ్రీ జిల్లా కో ఆర్డినేటర్ ప్రకటన ద్వారా తేటతెల్లమైంది.

క్లుప్తంగా

పంపిణీకి సిద్ధంగా విద్యా కానుక కిట్లు

● ఎస్ఎస్ఏ అకడమిక్ మానిటరింగ్ అధికారి రమేష్



విద్యా కానుక కిట్లను పరిశీలిస్తున్న ఎస్ఎస్ఏ అధికారి రమేష్

పొదిలి: విద్యా కానుక కిట్లు జిల్లాలో అన్ని ఎంఈఓ కార్యాలయాల్లోకి అందుబాటులో ఉన్నాయని ఎస్ఎస్ఏ జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎం.రమేష్ పేర్కొన్నారు. బుధవారం పొదిలిలో కిట్లు నిల్వ ఉంచిన గోడౌన్‌ను పరిశీలించారు. నిర్ణయించిన తేదీల్లో విద్యార్థులకు కిట్లు సక్రమంగా పంపిణీ చేసేలా ఎంఈఓలు పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల సర్వే నిర్వహణ తీరును పరిశీలించారు. పలువురు దివ్యాంగుల ఇంటికి వెళ్లి సర్వే వివరాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నిద్ర మత్తులో బల్ల పైనుంచి పడి వృద్ధుడు మృతి



ఈర్ల గురవయ్య (ఫైల్)

వెలిగండ్ల: మండలంలోని హుస్సేన్‌పురంలో ఓ వృద్ధుడు నిద్ర మత్తులో బల్ల పైనుంచి కింద పడి మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై ఎం.శివ కథనం ప్రకారం.. హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన ఈర్ల గురవయ్య(60) కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మంగళవారం రాత్రి గ్రామంలోని చెట్టుకింద ఉన్న బల్లపై పడుకుని నిద్రపోయాడు. నిద్రలో బల్ల పైనుంచి కింద పడటంతో తలకు తీవ్ర గాయమైంది. బుధవారం ఉదయం గురవయ్య కుటుంబ సభ్యులు కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురవయ్య మృతి చెందాడు. మృతుడి భార్య చెన్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగు మందు తాగి యువకుడు ఆత్మహత్య


● మృతుడిది నాయుడుపేట మండలం తుమ్మూరు



సెంథిల్ సాయి మృతదేహం

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని ప్రధాన తపాలా కార్యాలయం ఎదురుగా ఉన్న లాడ్జిలో తిరుపతి జిల్లా నాయుడుపేట మండలం తుమ్మూరు గ్రామానికి చెందిన చిట్టిబాబు కుమారుడు భాను సెంథిల్ సాయి(28) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ తెలిపారు. సెంథిల్ సాయి ఈనెల 19న మార్కాపురం పట్టణానికి వచ్చి హెడ్ పోస్టాఫీసు ఎదురుగా ఉన్న ఒక లాడ్జిలో గది అద్దెకు తీసుకున్నాడు. బుధవారం సాయంత్రం అద్దె అడిగేందుకు రూమ్ బాయ్ వెళ్లగా దుర్వాసన రావడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సంఘటనా స్థలంలో పురుగు మందు డబ్బాను ఎస్సై స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు విచారణలో తెలియాల్సి ఉందని, మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని చెప్పారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి



మృతుడు పెదవెంకటేశ్వర్లు

కొనకనమిట్ల: బైక్‌పై వెళ్తున్న యువకుడిని ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన 565 జాతీయ రహదారిపై చినారికట్ల–పెదారికట్ల మధ్యలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కొనకనమిట్ల మండలం పెదారికట్లకు చెందిన రాచకుంట పెద వెంకటేశ్వర్లు(35) తన బైక్‌పై చినారికట్ల జంక్షన్ వైపు వెళ్తున్నాడు. పెదారికట్ల బ్రహ్మంగారి గుడి సమీపంలో ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం, బైకును ఢీకొట్టి ఆగకుండా వెళ్లింది. తీవ్రంగా గాయపడిన పెదవెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య రమణమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై మాధవరావు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. బైకును ఢీకొట్టిన వాహనం బొలెరో ట్రక్ అయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

సెలయేరు పారుతుంటే..





ఉత్సాహంగా గడుపుతున్న సందర్శకులు

భైరవకోనలో జాలువారుతున్న నీరు

సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పర్యాటక పుణ్యక్షేత్రం భైరవకోనకు బుధవారం సందర్శకులు పోటెత్తారు. గత వారం రోజులుగా మండలంతోపాటు భైరవకోన అటవీ ప్రాంతంతో మోస్తరు వర్షాలు కురుస్తుండటంతో జలపాతంలో నీరు జాలువారుతోంది. దీంతో ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ జిల్లాల నుంచి సందర్శకులు భైరవకోనకు చేరుకుని ఉత్సాహంగా గడుపుతున్నారు. త్రిముఖ దుర్గాదేవి, భర్గలేశ్వర, కాలభైరవ, నగరేశ్వర ఆలయాలను సందర్శించి భక్తులు, అటు సందర్శకులు ఉల్లాసంగా, ఉత్సాహంగా గడుపుతున్నారు. భక్తులు, సందర్శకులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా ఈవో నర్రా నారాయణరెడ్డి, ఆలయ చైర్మన్ సిద్దు రమణారెడ్డి ఏర్పాట్లు చేశారు.

విద్యా, వసతి దీవెనలను అప్‌డేట్ చేయాలి

● సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్ లక్ష్మా నాయక్
● వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్లతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ లక్ష్మా నాయక్

ఒంగోలు సెంట్రల్: ప్రభుత్వం అందించిన విద్యా దీవెన, వసతి దీవెనలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ కళాశాలలకు అందించేలా విద్యార్థుల తల్లిదండ్రులను ప్రోత్సహించాలని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) ఎన్ లక్ష్మా నాయక్ అన్నారు. అంబేద్కర్ భవన్‌లో బుధవారం ఒంగోలు డివిజన్ పరిధిలోని వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, కళాశాల కోఆర్డినేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మానాయక్ మాట్లాడుతూ జిల్లాలోని డిగ్రీ ఆపై ఉన్న అన్ని కళాశాలల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థులకు 2023–24 విద్యా సంవత్సరానికి విద్యాదీవెన, వసతి దీవెనలకు సంబంధించి లబ్ధి చేకూరేలా తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. జాయింట్ ఖాతాలు ఇప్పటి వరకు అప్డేట్ కాని వాటిని పునరుద్ధరించడం, 2019–20, 2022–23 విద్యా సంవత్సరాల్లో తల్లుల ఖాతాలను నగదు చెల్లించినా కళాశాలలకు చెల్లించని వారిని గుర్తించి వారికి చెప్పి నగదు చెల్లించేలా చర్యలు తీసుకుని నవశకం లాగిన్‌లో నమోదు చేయాలని చెప్పారు. 2023–24 విద్యాసంవత్సరంలో 5 స్టెప్స్ వెరిఫికేషన్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి కారణాలను నవశకం లాగిన్‌లో అప్డేట్ చేయాలని కోరారు. ఎన్‌పీసీఐ పెండింగ్‌లో ఉన్న ఎస్సీ విద్యార్థుల ఆధార్ నంబర్‌ను బ్యాంకు ఖాతాకు అనుసంధానం చేయించాలని సూచించారు. త్వరితగతిన తగిన విధంగా విద్యార్థులకు మేలు జరిగేలా చూడాలని చెప్పారు. పనిపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఒంగోలు, కొండపి సహాయ సాంఘిక సంక్షేమాధికారులు ఎం. ఉదయశ్రీ,, యు దానయ్య, కే శ్రీనివాసులు, సహాయ గిరిజన సంక్షేమాధికారి అమర సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు

● ఆంధ్రకేసరి జూనియర్ కళాశాలలో సిబ్బందికి శిక్షణ
● డిజిటల్ ఆన్‌లైన్‌లో ఇంటర్ మూల్యాంకనం



శిక్షణ ఇస్తున్న పరీక్షల నిర్వహణ కమిటీ చైర్మన్ సైమన్ విక్టర్

ఒంగోలు టౌన్: ఈ నెల 24వ తేదీ నుంచి జరగనున్న ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించనున్నట్లు జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్, ఆర్ఐఓ ఏ సైమన్ విక్టర్ తెలిపారు. నగరంలోని ఏకేవీకే జూనియర్ కళాశాలలో బుధవారం చీఫ్ సూపరింటెండెంట్లు, అదనపు సీఎస్‌లు, కస్టోడియన్లు, స్క్వాడ్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 43 కేంద్రాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు, 28 కేంద్రాల్లో ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లా నుంచి మొదటి సంవత్సరం 15291 మంది, ద్వితీయ సంవత్సరం 7075 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని వెల్లడించారు. ఈ పరీక్షల నిర్వహణలో గతంలోని డిపార్ట్‌మెంటల్ అధికారుల స్థానంలో ఆయా కళాశాలల్లో సీనియర్ లెక్చరర్లు, ప్రైవేటు కళాశాలల్లోని కేంద్రాల్లో అక్కడి ప్రిన్సిపాళ్లు అదనపు సీఎస్‌లుగా వ్యవహరిస్తారన్నారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లకు ఆస్కారం లేకుండా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఏమాత్రం తేడా వచ్చినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డిజిటల్ విధానంలో మూల్యాంకనం:

ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల మూల్యాంకనంలో డిజిటల్ ఆన్‌లైన్ విధానం ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలోని 6 ప్రాంతాల్లో రిసెప్షన్ అండ్ స్కానింగ్ సెంటర్లను ఏర్పాటు చేశారని, అందులో ఒంగోలులోని ఏకేవీకే జూనియర్ కళాశాలలో కూడా ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కేంద్రం ప్రకాశం, బాపట్ల, పల్నాడు, నెల్లూరు జిల్లాలకు ఆర్ఆర్ ఎస్‌సీగా పనిచేస్తుందన్నారు. పరీక్ష కేంద్రాల నుంచి వచ్చిన ఆన్సర్ షీట్లను ఆర్ఆర్ఎస్‌సీలోని అధికారులు స్కానింగ్ చేసి బోర్డు అధికారికంగా నియమించిన ఎగ్జామినర్ల లాగిన్లకు అప్లోడ్ చేయడం ద్వారా వాల్యూయేషన్ ప్రక్రియ చేపట్టినట్లు వివరించారు. నూతనంగా చేపట్టిన మూల్యాంకన విధానం గురించి ఏకేవీకే జూనియర్ కళాశాలలో సైన్స్, ఆర్ట్స్, లాంగ్వేజెస్ అధ్యాపకులకు శిక్షణ నిర్వహించి పూర్తిగా అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సైమన్‌తో పాటుగా ముఖ్య అతిథిగా వచ్చిన డీఐఈఓ ఐ.శ్రీనివాసరావు సూచనలు, సలహాలు ఇచ్చారు. డీఈసీ సభ్యులు కె.ఆంజనేయులు, స్వరూపరాణి, మనోహరరెడ్డి హాజరయ్యారు.

పెన్షనర్ల సంఘ నాయకుడు కరీముల్లా ఖాన్ కన్నుమూత



పఠాన్ కరీముల్లా ఖాన్(ఫైల్)

ఒంగోలు టౌన్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పఠాన్ కరీముల్లా ఖాన్ బుధవారం తెలవారుజామున రంగుతోటలోని ఆయన స్వగృహంలో కన్నుమూశారు. పెన్షనర్ల హక్కుల కోసం ఆయన అలుపెరగని పోరాటాలు చేశారు. పెన్షనర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా, కోశాధికారిగా వివిధ హోదాల్లో నిబద్ధతతో పనిచేశారు. ఖాన్ భౌతికకాయాన్ని సంఘ జిల్లా గౌరవాధ్యక్షులు వి.పున్నయ్య, రాష్ట్ర కార్యదర్శి కె.రామారావు, జిల్లా నాయకులు కంచర్ల సుబ్బారావు, హనుమంతరావు, షేక్ సుభాని, శ్యామలరావు, మాల కొండయ్య, మారెళ్ల వెంకటరావు, ఈసీ మెంబర్లు శ్రీరాం మూర్తి, ప్రభాకరరావు, శరత్ బాబు, బి.అంకిరెడ్డి, శేషయ్య, వెంకటేశ్వర్లు, రజాక్ తదితరులు సందర్శించి నివాళులర్పించారు. ఖాన్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

మండల కేంద్రాలకు పాఠ్యపుస్తకాలు



పాఠ్యపుస్తకాల సరఫరాకు జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఈవో డి.సుభద్ర

ఒంగోలు: పాఠ్యపుస్తకాలను మండల కేంద్రాలకు పంపే ప్రక్రియ ప్రారంభమైంది. బుధవారం స్థానిక ప్రభుత్వ పాఠ్యపుస్తకాల గోదాము నుంచి ఈ పుస్తకాలను 38 మండలాలకు సరఫరా చేసే ప్రక్రియకు ఆర్టీసీ శ్రీకారం చుట్టింది. ఇందుకుగాను జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ బడి తెరిచే నాటికి పాఠ్యపుస్తకాలన్నీ పాఠశాలలకు చేర్చే ప్రక్రియలో భాగంగా తొలి దశలో 5.50 లక్షల పాఠ్యపుస్తకాలను తరలిస్తున్నామన్నారు. వీటిని మండల కేంద్రాలకు పంపుతామని, అక్కడ నుంచి పాఠశాలలకు పంపుతున్నట్లు చెప్పారు. రెండో దశ ప్రక్రియ కూడా జూన్ 5వ తేదీ నాటికి పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఒంగోలు డిపో మేనేజర్ శ్రీనివాసులు, ఆర్టీసీ ఏటీఎం కమర్షియల్ నవీన్, ప్రభుత్వ పాఠ్యపుస్తకాల గోదాము మేనేజర్ శివాజీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మోహినీ ఉత్సవం



మోహినీ ఉత్సవంలో చెన్నకేశవస్వామి



పూజల్లో పాల్గొన్న సీఐ వెంకటేశ్వరావు, ఎస్సై శివానగరాజు

హనుమంతునిపాడు: ప్రసిద్ధిగాంచిన చిన్న గొల్లపల్లి శ్రీలక్ష్మీ చెన్నకేశ్వస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం మోహినీ ఉత్సవం, ఏకాంత సేవను వైభవంగా నిర్వహించారు. గరుడ వాహనంపై ఆశీనుడైన స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించి వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగిస్తూ మోహినీ ఉత్సవం నిర్వహించారు. ఉభయదాతలుగా వ్యవహరించిన చెక్కా వంశస్తులు స్వామివారికి పొంగళ్లు సమర్పించారు. నీలకంఠాపురం, ఎలికవారిపల్లి, రంగంపేట పాలెగాళ్లు గోవింద నామాన్ని స్మరిస్తూ పోతు రాజుల వీర కేకల మధ్య భక్తి శ్రద్ధలతో ఖడ్గ సేవ నిర్వహించారు. అంకాలమ్మ తల్లి, పోతురాజు విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. సంతానం లేని మహిళలు స్వామి వారిని దర్శించుకుని ధ్వజ స్తంభం చుట్టూ 101 పర్యాయాలు ప్రదక్షిణ చేశారు. సంతానం పొందిన వారు పిల్లలకు తలనీలాలు తీయించి మొక్కులు చెల్లించారు. బుధవారం రాత్రి గజోత్సవం నిర్వహించారు. గురువారం సాయంత్రం కంపకళ్లి నిర్వహిస్తున్నట్లు దేవదాయ శాఖ ఈఓ వి.శ్రీనివాసబాబు తెలిపారు.

ఎక్కడ ఉన్నా కామాంధుడే!

● మహిళా ఉద్యోగులకు తప్పని తిప్పలు



మార్కాపురంలోని డీఎల్‌పీఓ కార్యాలయం

మార్కాపురం: ఆ ఉద్యోగి ఒంగోలులో విధులు నిర్వర్తించినా.. మార్కాపురంలో పనిచేసినా.. మహిళా ఉద్యోగులను వేధించడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు. సీనియర్ అసిస్టెంట్ హోదాలో విధులు నిర్వర్తిస్తూ తన కింది స్థాయి ఉద్యోగులకు ఆదర్శంగా ఉండాల్సిన ఆ ఉద్యోగి లైంగిక వేధింపులకు పాల్పడటం జిల్లా పంచాయతీరాజ్ శాఖలో మరోమారు తీవ్ర చర్చకు దారితీసింది. ఏడాది క్రితం ఒంగోలు డీపీఓ ఆఫీసులో పనిచేస్తూ అక్కడ పనిచేసే మహిళా ఉద్యోగిని వేధించడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటి డీఎల్‌డీఓ విచారణ చేసి కలెక్టర్‌కు నివేదిక ఇవ్వడంతో ఒంగోలు డీఎల్‌పీఓ కార్యాలయానికి బదిలీ చేశారు. మళ్లీ వివాదాస్పదం కావడంతో మార్కాపురానికి బదిలీ చేశారు. ఇక్కడ కూడా బుద్ధి మారలేదు. కార్యాలయంలో పనిచేసే ఓ మహిళా ఉద్యోగిపై కన్నేసి నాలుగు నెలలుగా వేధిస్తున్నాడు. ఆయన చేష్టలు భరించలేని ఆమె స్థానిక డీఎల్‌డీఓకు ఫిర్యాదు చేశారు. డీఎల్‌డీఓ మందలించినా తీరు మారకపోగా వేధింపులు మరింత ఎక్కువ కావడంతో తట్టుకోలేక జిల్లా పంచాయతీ అధికారికి ఆమె మొరపెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం డీఎల్‌పీఓ కార్యాలయ సిబ్బందిని ఒంగోలులో విచారించారు. సీనియర్ అసిస్టెంట్ వేధింపులు నిజమేనని సిబ్బంది చెప్పినట్లు తెలిసింది. డీపీఓ విచారణ నివేదికను నేడో.. రేపో కలెక్టర్‌కు అందజేయనున్నారు. మొత్తం మీద డీఎల్‌పీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వ్యవహార శైలి ఆ శాఖకు మచ్చ తెచ్చే విధంగా తయారైంది.

దూసుకొచ్చిన మృత్యువు

● డీసీఎం వాహనాన్ని ఢీకొట్టిన మినీ లారీ
● ప్రమాదంలో భవన నిర్మాణ కార్మికురాలు మృతి
● మరో ముగ్గురికి గాయాలు



ప్రమాదం ధాటికి బోల్తాపడిన డీసీఎం లారీ

కనిగిరి రూరల్: మినీ లారీ, డీసీఎం లారీ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదం బుధవారం కనిగిరి పట్టణ పరిధిలోని మాచవరం సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మాచవరం నుంచి సెంట్రింగ్ సామగ్రితో కనిగిరి వైపు వస్తున్న డీసీఎం లారీని, ఎదురుగా విజయవాడ నుంచి కడప వైపు వెళ్తున్న మినిలారీ(వ్యాన్) వేగంగా ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో డీసీఎం లారీలో ప్రయాణిస్తున్న మాచవరానికి చెందిన భవన నిర్మాణ కార్మికులు ఉప్పు రమాదేవి(51), సుశీల, మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులకు స్థానిక ప్రైవేట్ వైద్యశాలలో ప్రథమ చికిత్స చేసి ఒంగోలు తరలిస్తుండగా.. మార్గమధ్యంలో పొదిలి సమీపంలో ఉప్పు రమాదేవి(51) మృతి చెందింది. మిగిలిన క్షతగాత్రులను ఒంగోలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.త్యాగరాజు తెలిపారు.



తోతాపురి.. రైతులకు సిరి

● జ్యూస్ తయారీకి ఉలవపాడు మామిడి
● రోజూ 100 టన్నులకు పైగా బెంగళూరు రకం కాయల ఎగుమతి
● ఈ ఏడాది దిగుబడి తగ్గడంతో అధిక డిమాండ్
● ప్రారంభంలోనే టన్ను ధర రూ.20 వేలు పలకడంతో రైతుల హర్షం

ఉలవపాడు: జ్యూస్ తయారీకి ఉలవపాడు నుంచి మామిడి ఎగుమతులు ప్రారంభమయ్యాయి. బంగినపల్లి మామిడితోపాటు పండ్ల రసం తయారీలో అధికంగా వినియోగించే బెంగళూరు రకం(తోతాపురి) కాయలకు కూడా ఉలవపాడు ప్రసిద్ధి. తోతాపురి మామిడిలో పీచు శాతం అధికంగా ఉండటం వల్ల ఈ కాయలను జ్యూస్ తయారీకి ఉపయోగిస్తారు. ఏటా తోతాపురి మామిడిని వ్యాపారులు భారీ మొత్తంలో కొనుగోలు చేసి జ్యూస్ ఫ్యాక్టరీలకు తరలిస్తుంటారు. ఈ ఏడాది కూడా చిత్తూరు జిల్లాలోని జ్యూస్ తయారీ పరిశ్రమలకు ఉలవపాడు పరిసర ప్రాంతాల నుంచి బెంగళూరు రకం కాయలు ఎగుమతి అవుతున్నాయి. రోజూ సుమారు 100 టన్నులకు పైగా మామిడి కాయలు ఎగుమతి అవుతాయని అంచనా. పరిశ్రమల యజమానులు ఇక్కడి దళారులను ఇప్పటికే సంప్రదించడంతో మామిడి ఎగుమతులు ఊపందుకున్నాయి.

టన్ను ధర రూ.20 వేలు

ఈ ఏడాది ఎగుమతుల ప్రారంభ దశలోనే బెంగళూరు రకం మామిడి ధర టన్ను రూ.20 వేలు పలికింది. ఏటా టన్ను ధర రూ.10 వేల నుంచి ప్రారంభమై అత్యధికంగా రూ.25 వేల వరకు పలికే కాయలకు ఈ ఏడాది ఆరంభంలోనే రూ.20 వేలు దక్కడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తోతాపురి రకం దిగుబడి తక్కువగా ఉండటంతో డిమాండ్ అధికంగా ఉంది. ఎగుమతులు కూడా వేగంగా పూర్తయ్యే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.



కాయలను ఎగుమతి చేస్తున్న కూలీలు

24 నుంచి పాలేటి గంగ తిరునాళ్ల

పీసీపల్లి: మండల పరిధిలోని పాలేరు వద్ద కొలువై ఉన్న గంగమ్మ ఆలయంలో ఈ నెల 24 నుంచి తిరునాళ్ల మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 24న అంకురార్పణ, 25న అలంకరణ, 26న ఉత్సవం, 27న ప్రధాన తిరునాళ్ల, 28న పొంగళ్ల సమర్పణతో వేడుకలు ముగుస్తాయని పేర్కొన్నారు. తిరునాళ్లకు వేలాదిగా భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.